క్లుప్తంగా

పరామర్శ



జయచంద్రారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: మండలంలోని రాజనాలవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్.జయచంద్రారెడ్డి (80) కేదార్‌నాథ్ యాత్రలో శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి మృతదేహం రాజనాలపల్లికి చేరింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుమారులు శ్రీధర్ రెడ్డి, శశిధర్ రెడ్డిని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు రెడ్డి కూడా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కారును ఢీకొన్న లారీ

- తప్పిన ప్రాణాపాయం



దెబ్బతిన్న కారు ముందు భాగం

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి సమీపంలోని పవర్‌గ్రిడ్ కార్యాలయం సమీపంలో కదిరి–రాయచోటి ప్రధాన రహదారిపై ఆదివారం కారును లారీ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా రాజంపేటలోని మండపల్లె గ్రామానికి చెందిన గాదిరాజు సూర్యప్రకాష్ రాజు తన తల్లి నాగమణితో కలిసి కాట్రగంటవారి పల్లిలో బంధువులను వివాహానికి ఆహ్వానించేందుకు వెళ్లారు. తిరిగి తమ గ్రామానికి వెళుతున్న సమయంలో రాయచోటి నుంచి కదిరికి వెళుతున్న కేఏ51 డి 3393 నంబరు గల లారీ వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగమణికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ఎడమ భాగం దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సద్గురుడు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



వాచ్‌మెన్ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1983–84 సంవత్సరంలో డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన వాచ్‌మెన్ క్వార్టర్స్‌ను ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల్లో బీకాం చదువుకున్న బ్యాచ్ గోరకాటి పెద్దారెడ్డి రూ.1.45 లక్షలు, రాధాకృష్ణమ రాజు రూ.50 వేల చొప్పున విరాళం అందించడంతో పాటు మిత్ర బృందం సహకారంతో వాచ్‌మెన్ క్వార్టర్స్‌ను నిర్మించారని తెలిపారు. తాము చదివిన కళాశాలను మరిచిపోకుండా తమవంతు సాయం చేసేందుకు, కళాశాల అభివృద్ధికి ముందుకు వస్తున్న పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యోగ నారాయణరెడ్డి, వెంకటేష్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలోని ఉబ్బదేవర గంగమ్మ గుడి నిర్మాణానికి ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ రూ.15 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బత్తల వెంకటరమణ, పట్టణాధ్యక్షుడు కేఎస్ బాహుద్దీన్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు లింగాల లోకేశ్వరెడ్డి, రజక సంఘం నాయకులు నారాయణ, రామయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

పుట్టపర్తి టౌన్: పోరాటాలు చేసి ఎస్సీ వర్గీకరణ సాధించుకుంటామని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాయుడు అధ్యక్షతన మహాసభ జరిగింది. ఈ సమావేశానికి జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు పోరాటాలు చేస్తామన్నారు. గ్రామాల్లో మాదిగల్లో చైతన్యం తీసుకరావడానికి మిషన్ 50 డేష్ కార్యక్రమం కోసం గ్రామ నాయకులు కృషి చేయాలన్నారు. ఆగస్టులో హైదరాబాద్‌లో ఉమ్మడి రాష్ట్రాల మాదిగలతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో గంగాద్రి, పైపల్లి నరశింహులు, తిప్పన్న, ఎస్టీడీ నరశింహులు, ఫోటోసాయి, ఎంఈఎఫ్ నాయకులు రవిశంకర్, నాగభూషణ, అశోక్, నాగరాజు, శివకుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

నాలుగేళ్లు.. సంక్షేమ పరవళ్లు

- అనతి కాలంలోనే మారిన కదిరి నియోజకవర్గ రూపురేఖలు
- ఎమ్మెల్యే సిద్దారెడ్డి చొరవతో నిధుల వరద
- జోరుగా సాగుతున్న అభివృద్ధి పనులు



రూ.234 కోట్లతో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి (ఫైల్)

కదిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయింది. ఇందులో రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి కారణంగా అభివృద్ధి కుంటుపడింది. మిగిలిన రెండేళ్లలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందింది. ఇందులో భాగంగా సీఎం జగన్ నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు చేయడంతో పనులు ఊపందుకున్నాయి. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి చొరవతో కదిరి నియోజకవర్గం కూడా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. ఇప్పటికే రూ.వందల కోట్ల నిధులు కదిరి నియోజకవర్గానికి వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కదిరి నియోజకవర్గం ఈ నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి చెందింది. అందులో మచ్చుకు కొన్ని చూద్దాం..

కదిరి మున్సిపల్ పరిధిలో:

- రూ.234 కోట్లతో కదిరికి రింగ్‌రోడ్ తరహాలో బైపాస్ రోడ్ నిర్మాణం
- కదిరిలో ముస్లిం మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ.23 కోట్లు, ఉర్దూ జూనియర్ కళాశాల పక్కా భవన నిర్మాణం కోసం రూ.4.50 కోట్లు, ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాల భవనం కోసం రూ.15 కోట్లు, ఉర్దూ లైబ్రరీ, కంప్యూటర్, రికార్డు రూం నిర్మాణం కోసం రూ.65 లక్షలు, అలాగే ఐటీఐ కళాశాల పక్కా భవన నిర్మాణం కోసం మరో రూ.10 కోట్లు మంజూరయ్యాయి.
- పట్టణంలో రూ.18 కోట్లతో ప్రభుత్వాసుపత్రి కొత్త భవనం ఆధునాతన వసతులతో నిర్మాణం
- సుమారు రూ.4 కోట్లతో కోనేరు సుందరీకరణ పనులకు శ్రీకారం.
- రూ.కోటికి పైగా ఖర్చు చేసి నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణం.
- సుమారు రూ.6 కోట్లతో వేమారెడ్డి కూడలి రోడ్డు విస్తరణ పనులు పూర్తి. ఫోర్‌లైన్ రోడ్డు ఏర్పాటు.
- మంచి నీటి సరఫరాకు నాలుగు వైపులా 4 కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం.
- పట్టణ పరిధిలో ఒక్కొక్కటి రూ.80 లక్షల వ్యయంతో 4 అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం.
- పట్టణంలో 3 వేల మందికి పైగా పేదలకు ఇంటి పట్టాలు మంజూరు.
- నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం.
- సుమారు రూ.2 కోట్లతో హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి శ్రీకారం.

కదిరి మండలంలో..

- రూ.80.76 కోట్లతో మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులు.
- గ్రామ సచివాలయాల నిర్మాణం కోసం రూ 4.68 కోట్లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం కోసం రూ.2.40 కోట్లు,
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల కోసం రూ.1.72 కోట్ల ఖర్చు.
- సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.60 కోట్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.3.80 కోట్ల ఖర్చు.
- హిందూపూర్ రోడ్డులో రూ.18 కోట్లతో బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల నిర్మాణం.

తలుపుల మండలంలో..

- రూ.9.15 కోట్లతో అక్కసానిపల్లి, చిన్నపల్లి, వీరప్పగారిపల్లి, చెరువుమొరవపల్లి, బాలిరెడ్డిపల్లి, లక్కసముద్రం, మూలపల్లి, వేములగొంది, చదలవాండ్లపల్లి, శింగన పల్లి, రాజమోళ్లపల్లి, ఇంకా ఎన్నో గ్రామాలకు రోడ్డు సౌకర్యం.
- రూ.1.33 లక్షలతో మండల కేంద్రంలో ఆసుపత్రి భవన నిర్మాణం.
- కేజీబీవీ స్కూల్ ప్రాంగణంలో రూ.1.02 లక్షలతో ఇంటర్ విద్యార్థులకు నూతన కళాశాల భవన నిర్మాణం.
- చంద్రబాబు సాధ్యం కాదని ఆపేసిన హంద్రీనీవా టన్నెల్ పనుల పూర్తి.

గాండ్లపెంట మండలంలో..

- రూ.1.22 కోట్లతో పలు పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం.
- రూ.13 కోట్లతో రైతు భరోసా కేంద్రాలు, మిల్క్ చిల్లింగ్ సెంటర్, వైఎస్సార్ క్లినిక్‌ల నిర్మాణం.
- రూ.15 కోట్లతో మండల పరిధిలోని పలు గ్రామాలకు సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం.
- సుమారు రూ.50 కోట్లతో హంద్రీనీవా జలాలను మండలానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నం

ఎన్‌పీ కుంట మండలంలో..

- సుమారు రూ.60 కోట్లకు పైగా వెచ్చించి రోడ్లు, పాఠశాల భవనాల నిర్మాణం.
- రూ.4 కోట్లతో 10 సచివాలయ భవన నిర్మాణాలు.
- రూ.2.18 కోట్లతో ఆర్బీకేల నిర్మాణం.
- రూ.4 కోట్లతో నాడు–నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు.
- రూ.15.16 కోట్లతో రహదారుల నిర్మాణం
- రూ.70 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం
- రూ.1.77 కోట్లతో పలు పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం.

నల్లచెరువు మండలంలో..

- రూ.1.25 కోట్లతో పాత స్టేషన్ నుంచి మలమీదపల్లికి రోడ్డు నిర్మాణం, దామవాండ్లపల్లి నుంచి నల్లజోడువారిపల్లి రోడ్డుకు రూ.1.87 కోట్లు, దేవిరింటిపల్లి మీదుగా పాలపాటిదిన్నె రోడ్డుకు రూ.1.24 కోట్లు, దేవిరెడ్డిపల్లి రోడ్డుకు రూ.54 లక్షలు, మల్లయ్యగారిపల్లి నుండి ఇందుకూరుపల్లి వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ1.37 కోట్లు, కమ్మవారిపల్లి క్రాస్ నుండి పత్రవాండ్లపల్లి వరకూ రూ1.74 కోట్లతో బీటీ రోడ్, ఇంకా పలు గ్రామాలకు సీసీ, బీటీ రోడ్లు
- రూ.4.95 కోట్లతో 10 సచివాలయ నిర్మాణాలు, రూ.1.96 కోట్లతో రైతు భరోసా కేంద్రాలు, రూ.1.75 కోట్లతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం

తనకల్లు మండలంలో..

- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సొంత నిధులు రూ.2.73 కోట్లతో ఎంసీ తండా వద్ద ఉన్న హంద్రీనీవా కాలువ నుంచి సీజీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తెచ్చే ప్రయత్నం
- రూ.6.23 కోట్లతో నాడు–నేడు కింద అభివృద్ధి పనులు.
- రూ.9.25 కోట్లతో 14 గ్రామ సచివాలయాలు, 14 ఆర్బీకేలు, 4 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం.
- రూ.15.60 కోట్లతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం

మాది చేతల ప్రభుత్వం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీలు 98 శాతానికి పైగా నెరవేర్చి.. మాది చేతల ప్రభుత్వమని నిరూపించారు. అందుకే మేం ప్రతి గడపకూ ధైర్యంగా వెళుతున్నాం. గతంలో చంద్రబాబు ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చ లేదు. ఈ నాలుగేళ్ల పాలనలోనే మేము ఎంతో చేశాం. భవిష్యత్‌లో ఇంకెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతాం.

– డా.పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్యే, కదిరి

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని అనంతపురం మున్సిపల్ కమిషనర్ గుర్రం రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న గుర్రం విజయభాస్కర్ రెడ్డి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం లింగారెడ్డిపల్లి, వెంకటగారిపల్లి గ్రామాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లింగారెడ్డిపల్లి జట్టు 10 ఓవర్లలో 85 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెంకటగారిపల్లి 61 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. విజేతగా నిలిచిన లింగారెడ్డిపల్లి జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన వెంకటగారిపల్లి జట్టుకు రూ.5 వేల నగదు, ట్రోఫీ అందజేశారు. లింగారెడ్డిపల్లి జట్టు ఆటగాడు పవన్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా రూ.2,500, బెస్ట్ బ్యాట్స్‌మెన్ విభాగంలో వెంకటగారిపల్లికి చెందిన వలికి రూ.2,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో గుర్రం నరసింహారెడ్డి, శిరీష, ఖుషీ, పృథ్వీ, వడ్డె రామాంజనేయులు, ఈశ్వరయ్య, నారాయణస్వామి, లోక్‌నాథరెడ్డి, చల్లా చౌదరి, రామయ్య పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ చరిత్రాత్మకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో 25 వేల జగనన్న పక్కా గృహాలు నిర్మిస్తుండటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చెరువువాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని చెరువావాండ్లపల్లి, సీ.కొత్తపల్లి గ్రామాలకు చెందిన 170 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో కమ్మలు పెడతాం, కడియాలు పెడతాం, చెవులకు దుద్దులు పెడతాం అంటూ మంత్రగాళ్లు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను గుర్తించాలన్నారు. చంద్రబాబు పాలనలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంఘటనను గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక వర్షాలు సమృద్ధిగా కురుస్తూ తాగు, సాగునీటి కొరత లేకుండా పోయిందన్నారు. రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందన డానికి ఇదే నిదర్శమన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాలపైనే టీడీపీ రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. నల్లమాడ మీదుగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, తహసీల్దార్ దేవేంద్రనాయక్, వీఆర్‌ఓ వాసుదేవరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు, స్థానిక నాయకులు శంకర్ రెడ్డి, కొక్కంటి సాంబశివారెడ్డి, కాడా లక్ష్మీరెడ్డి, నరసింహారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఓబులేసు, నరసింహులు, రామాంజి పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో పేద సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులోని ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాల పాలన సంక్షేమ పండుగలా సాగిందన్నారు. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, రైతులు, యువతకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాబందుల్లా ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు గమనించి మరో మారు జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమం పోయి క్షామం రావడం ఖాయమన్నారు. పుట్టపర్తి అభివృద్ధి చెందాలంటే ఇక్కడ తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోని రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్, వైస్ చైర్మన్ తిప్పన్న, టౌన్ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు పవన్‌కుమార్, చెరువు భాస్కర్‌రెడ్డి, నాయకులు పార్థసారధి రెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, రాజారెడ్డి, బాబుల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, గంగాద్రి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

71 మందికి కంటి పరీక్షలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన శ్రీచక్ర ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 71 మందికి కంటి పరీక్షలు చేశారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, క్యాంప్ చైర్మన్ జయరాం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పూర్వ విద్యార్థుల సందడి



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ముదిగుబ్బ: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. ఒకొరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు శ్రీనివాసరెడ్డి, మురళీధర్, గోపాల్‌రెడ్డి, ఇమాం షరీఫ్, బాబా పక్రుద్దీన్‌లను సన్మానించారు.

అంకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకుడు మంజునాథ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వస్తి పుణ్యాహవచనం, కలశస్థాపన, కలశారాధన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ప్రదోషకాలపూజ, మహాన్నపనం, ధాన్యాధివాసం, గణపతి, నవగ్రహ హోమాలు చేపట్టారు. విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రతి నెలా అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్: ప్రతి నెలా పౌర్ణమి రోజున అరుణాచలానికి కదిరి డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం మైనుద్దీన్ తెలిపారు. ఆదివారం అరుణాచలానికి ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. కదిరి నుంచి రెండు, నల్లచెరువు నుంచి ఒకటి చొప్పున బస్సు సర్వీసులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నాగసుబ్బయ్య పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కదిరి అర్బన్: మండల పరిధిలోని బాలప్పగారిపల్లి తండాలో ఆదివారం జూదం ఆడుతున్న 9 మందిని రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సూర్యనారాయణ తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని.. ముగ్గురికి గాయాలు

పెనుకొండ రూరల్: స్థానిక 44వ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వానాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఘటనపై స్థానికులు తెలిపిన మేరకు.. తాడిమర్రికి చెందిన విశ్వనాథ్ ద్విచక్ర వాహనంపై పెనుకొండ వైపు వెళ్తుండగా, మార్గంమధ్యలో కియా పరిశ్రమ ఎదురుగా అదుతప్పి డివైడర్‌ను ఢీకొనింది. ఇదే సమయంలో వైనుకవైపు నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న రమణ, బాలకృష్ణ ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రశాంతి నిలయం: మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి సచివాలయం పరిధిలోని 15, 16 వార్డుల్లో సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్ బీమా సర్వే వేగవంతం చేయండి

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ఉన్న 7 గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ బీమా సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అంజినప్ప ఆదివారం ఆయా గ్రామ సచివాలయ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెన్యూవల్, కొత్త నమోదును వేగవంతం చేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ కార్యదర్శులు సర్వేపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు.

కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా చౌడప్ప యాదవ్

తనకల్లు: కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన తోపుల చౌడప్ప యాదవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా చౌడప్పయాదవ్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు



అరుణబాయి, రామమోహన్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనాయక్, బ్రహ్మానందరెడ్డి, ఖాదర్ వలి, కేశవ్

పుట్టపర్తి: పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. బుక్కపట్నం మండలానికి సంబంధించి ఆదివారం పార్టీ కార్యాలయం కమిటీల జాబితాను విడుదల చేసింది. మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా నార్శింపల్లి తండాకు చెందిన అరుణ బాయి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మారాలకు చెందిన రామమోహన్, రైతు సంఘం మండల అధ్యక్షుడిగా రాశింపల్లికి చెందిన కేపీ భాస్కర్‌రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మదిరేబైలు తండాకు చెందిన లక్ష్మీనాయక్, యువజన విభాగం మండల అధ్యక్షుడిగా సిద్ధరాంపురానికి చెందిన బ్రహ్మానందరెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా ఖాదర్ వలి, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా కృష్ణాపురం గ్రామానికి చెందిన కేశవ్‌ను నియమించినట్లు పార్టీ కార్యాలయం వెల్లడించింది. వీరితో పాటు ప్రతి కమిటీలోనూ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మొత్తం 18 నుంచి 25 మంది ఉంటారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

7న తుమ్మచెట్ల వేలం

అమడగూరు: తుమ్మల గ్రామ పంచాయతీలో ఈనెల 7వ తేదీన తుమ్మచెట్ల వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ లక్ష్మీనరసమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని సూచించారు.

గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవుడి వైభవం



ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు, డైరెక్టర్ల సమక్షంలో గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి, కొలువుదీర్చారు. పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గోదా రంగనాథ స్వామి మహిళా సంఘం సభ్యులు కోలాటం ఆడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోనున్న రమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి సందర్భంగా అరుణాచల శివ నామస్మరణతో భక్తులు పూజలు చేశారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల పంచాయతీ దళిత కాలనీకి చెందిన మహిళలు ఆదివారం గాండ్లపెంట గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాలనీ నుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాల బుట్టలను నెత్తిపై పెట్టుకుని డప్పు వాయిద్యాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది వానలు సకాలంలో కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు.

నిత్యపూజలకు విరాళం

పుట్టపర్తి అర్బన్: గంగిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో నిత్య పూజలు నిర్వహించేందుకు గ్రామానికి చెందిన మలసాని చంద్రాయుడు, రామకృష్ణ, రాజశేఖర, విజయ్‌భాస్కర్, కృష్ణమూర్తి తదితరులు ఆదివారం రూ.51,116 విరాళాన్ని కమిటీ సభ్యులు ఆదెప్ప, తోయరాజుశర్మకు అందజేశారు.

రోడ్డుపై సైకో హంగామా

కదిరి టౌన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన గొరిల్లా అనే వ్యక్తి భార్యతో గొడవపడి ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ప్రతి సారి భార్యతో గొడవపడి స్టేషన్‌కు రావడంతో పోలీసులు అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అయితే రూరల్ స్టేషన్ దగ్గర రోడ్డుపై గొరిల్లా మళ్లీ హంగామా చేస్తుండంతో టౌన్ స్టేషన్‌కు వెళ్తున్న సీఐ మధు కారు ఆపారు. ఎవరు నువ్వు అని ప్రశ్నించడంతో గొరిల్లా సీఐని నానాభూతులు తిట్టాడు. పోలీసులు అతడికి దేహశుద్ధి చేశారు. దీంతో గొరిల్లా పరుగు తీశాడు. చివరకు గొరిల్లా ఓ సైకో అని రూరల్ పోలీసులు చెప్పడంతో వదిలేశారు.

గురుకులలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని మారుతినగర్‌లో ఉన్న మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 6, 7, 9 తరగతులకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ యం.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను బ్యాక్‌లాగ్ ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 6వ తరగతిలో ఎస్సీ–2 సీట్లు, 7వ తరగతిలో బీసీ–డీ ఒక సీటు, 9వ తరగతిలో బీసీ–బీ ఒక సీటు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటల నుంచి 12:30 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష 50 మార్కులకు ఉంటుందని, ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.